ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

3

సోమవారం 17 జూన్ 2024




మద్యం తాగేశారు

28 రోజులు..

రూ.39.64 కోట్లు

● మదనపల్లె డిపో పరిధిలో జోరుగా మద్యం విక్రయాలు



మదనపల్లె టౌన్, జూన్ 16: జిల్లా పరిధిలోని మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో మే నెలలో 28 రోజులకు గాను మద్యంప్రియులు ఏకంగా రూ.39.64 కోట్ల విలువైన మద్యం తాగేశారు. ఎన్నికల సందడి, రాజకీయ నాయకుల ప్రలోభాలు వెరసి మదనపల్లె డిపో పరిధిలో 68ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రూ.36.23 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇవి కాకుండా మదనపల్లె డిపో పరిధిలోని ఆరు బార్లలో రూ.3.41 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తం మీద మే నెలలో రూ.39.64 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం, పుంగనూరు, పలమనేరు ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో 68 ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఆరు బార్లు ఉన్నాయి. మే నెలలో 31 రోజులు ఉండగా అందులో ఎన్నికలు నిర్వహించిన 13వ తేదీ, ముందు రోజు, తరువాత రోజు కలిపి మూడు రోజులు మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. ఇవి పోను మిగిలిన 28 రోజుల్లో మద్యం ప్రియులు పెద్దమొత్తంలో మద్యం తాగేశారు. వాస్తవంగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రెమిషన్ విధించారు. గత ఏడాది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మార్చి, ఏప్రిల్ నెలల్లో విక్రయించిన మద్యం విలువకు 15 శాతం మాత్రమే అదనంగా విక్రయించాలని ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో ఉదయం 11 గంటలకు తెరుచుకున్న మద్యం దుకాణాలు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటలకే పరిమితి దాటిపోవడంతో మూసివేసేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ నెలలో రూ.20.94 కోట్ల విలువైన మద్యం మాత్రమే విక్రయాలకు కట్టడి చేశారు. ఇదిలా వుండగా ఎన్నికల పండగ ప్రారంభమైన మార్చి నెలలో మాత్రం ఏకంగా రూ.35.42 కోట్ల మద్యం విక్రయాలు జరగడం విశేషం. మొత్తం మీద ఎన్నికల పుణ్యమా అని అప్పటి ప్రభుత్వానికి మూడు నెలల్లోనే రూ.95 కోట్లు మద్యం విక్రయాల ద్వారా ఆదాయం వచ్చింది.

పీలేరు సంతలో పొట్టేళ్లే.. పొట్టేళ్లు!

● రైతులు, వ్యాపారులతో కిటకిటలాడిన సంత



వ్యాపారులు, జీవాలతో కిటకిటలాడుతున్న పీలేరు సంత

పీలేరు, జూన్ 16: కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు, మేకపోతులతో పీలేరులో ఆదివారం జరిగిన పశువుల వారపు సంత కిటకిటలాడింది. త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు పెద్దఎత్తున పొట్టేళ్లు, మేకపోతులు ఖుర్బానీ ఇస్తుంటారు. ఆ కారణంగా బక్రీద్ పండుగ సమయంలో వాటికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. పట్టణీకరణ పెరిగిపోయిన నేపథ్యంలో వాటిని మేపుకునే సౌకర్యం లేని వారు పండుగకు వారం, పది రోజుల ముందు వాటిని కొనుగోలు చేసి పండుగ రోజు ఖుర్బానీ ఇస్తుంటారు. దీంతో ప్రతి ఏటా బక్రీద్ పండుగకు ముందు జరిగే సంతల్లో పొట్టేళ్లు పెద్దసంఖ్యలో దర్శనమిస్తుంటాయి. అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులతో పీలేరు సంత కిక్కిరిసిపోయింది. కేవలం పీలేరు పరిసర ప్రాంతం నుంచే కాకుండా మదనపల్లె, తంబళ్లపల్లె, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లె నుంచి రైతులు పొట్టేళ్లు, మేకపోతులను తీసుకువచ్చారు. వాటిని కొనుగోలు చేయడానికి పీలేరు మాత్రమే కాకుండా పొరుగున తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు, సామాన్యులు రావడంతో పొట్టేళ్లు, మేకపోతులకు మంచి ధరలు లభించాయి. తాము కోరిన విధంగా పొట్టేళ్లు, మేకపోతులు దొరికాయన్న సంతృప్తితో కొనుగోలుదారులు, తాము పడిన కష్టానికి మంచి ప్రతిఫలం దక్కిందన్న ఆనందంతో రైతులు సంత నుంచి వెనుదిరిగారు.



పీలేరు సంతకు వచ్చిన వివిధ రకాల పొట్టేళ్లు, మేకపోతులు


ఫైలు కదలాలంటే.. పైసలివ్వాల్సిందే..

● ప్రతి పనికి రేటు పెట్టి వసూళ్లు

● చక్రం తిప్పుతున్న ఓ అధికారి ● ఆయన బాటలోనే సిబ్బంది

● ఇది ఆర్టీవో కార్యాలయంలో మామూళ్ల దందా

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద నడుస్తుంది అనే సామెత ఉంది. రాయచోటి ఆర్టీవో కార్యాలయానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఈ సామెత గుర్తొస్తుంది. ఎందుకంటే ఇక్కడకు ఆర్టీవో కొత్తగా రావడం.. ఆయనకు ఈ కార్యాలయంలో పరిస్థితులపై సరైన అవగాహన లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న ఓ అధికారి తను ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహారం నడిపిస్తున్నాడు. ఈయన కనుసన్నల్లోనే సిబ్బంది వసూళ్ల దందాకు తెరలేపి అందినకాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.



రాయచోటి (కలెక్టరేట్), జూన్ 16: కొత్తగా జిల్లాలు ఏర్పడిన తర్వాత రాయచోటిలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. రాయచోటి ప్రాంతం ట్రాన్స్‌పోర్టేషన్ ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రతిరోజు ఎల్ఎల్ఆర్‌లు 30, డీఎల్ 30, ఎఫ్‌సీలు 30 వస్తూ ఉంటాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఓ అధికారి అండదండలతో ఎల్ఎల్ఆర్‌కు రూ.500, డీఎల్ రూ.1000, ఎఫ్‌సీకి రూ.5 వేలు చొప్పున రేట్లు పెట్టి మరి దందా నడిపిస్తున్నారు. అంతేగాకుండా ఆధార్ సీడింగ్‌కు రూ.2 వేలు, వెహికల్ ట్రాన్స్‌ఫర్‌కు రూ.5 వేలు చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఏదైనా పనిపై ఆర్టీవో కార్యాలయానికి వెళితే జేబులు ఖాళీ కావాల్సిందేనని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ కార్యాలయం ఉండడంతో వీరిపై సరైన నిఘా లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అందిన కాడికి దోచేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

ఆ అధికారి కనుసన్నల్లోనే..

రాయచోటిలో కొత్తగా ఆర్టీఓ కార్యాలయం ఏర్పాటు కాగానే.. ఓ అధికారి పైస్థాయి నుంచి పలుకుబడి ఉపయోగించి పట్టుపట్టి మరి ఇక్కడ పోస్టింగ్ వేయించుకున్నారని తెలిసింది. అప్పటి నుంచి ఆ అధికారి ఏదో ఒక సెంటర్ నుంచి మామూళ్ల వసూలుకు శ్రీకారం చుట్టాడు. అయితే అప్పుడు ఉన్న ఆర్టీవో శాంత కుమారి ఈయన ఆగడాలకు అడ్డుకట్ట వేసి కంట్రోల్‌లో ఉంచిందని కార్యాలయం సిబ్బంది చెబుతున్నారు. గత ఏడాది ఆమెకు ప్రమోషన్ రావడంతో బదిలీపై వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఈ అధికారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. ఏకంగా కార్యాలయంలో ఉన్న మహిళా సిబ్బంది ద్వారా నేరుగా లంచాలు తీసుకునేందుకు తెరలేపాడు. మోటారు సైకిల్ బదిలీ చేయడానికి రూ.500, కారుకు రూ.1000, లారీకి, బస్సుకు రూ.3 వేలు ఇలా రేటు పెట్టి మరి వసూలు చేస్తున్నారని కార్యాలయంలో గుసగుసలు వినపడుతున్నాయి. ఆధార్‌కార్డు సీడింగ్ చేయడానికి రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నట్లు సమాచారం. మదనపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, రాయచోటి ప్రాంతాల నుంచి బ్రోకర్లను పెట్టి మరి వసూళ్లు చేస్తున్నారని తెలిసింది.

గతంలో ఎన్నడూ ఇలా లేదు..



నేను కార్లు అమ్మడం, కొనడం చేస్తూ ఉంటాను. వారానికి రెండు, మూడుసార్లు ఆర్టీవో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. వెహికల్ ట్రాన్స్‌ఫర్ కోసం చలానా 850 రూపాయలైతే.. రూ.5 వేలు తీసుకున్నారు. వీరిని అడిగే నాధుడే లేడు. ఎందుకిలా చేస్తున్నారని ఒకసారి ప్రశ్నించినందుకు ఆన్‌లైన్ పనిచేయడం లేదని సాకు చెప్పి నన్ను రెండు వారాలు తిప్పించారు. ఈ వ్యవహారం అంతా ఇక్కడ పనిచేసే ఓ అధికారి కంట్రోల్‌లో జరుగుతోంది. ఇప్పటికైనా పైస్థాయి అధికారులు నిఘా పెట్టి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి.

- రవికుమార్, కార్ల కొనుగోలు దారుడు, రాయచోటి

ఆర్టీవో వివరణ

తాను ఇక్కడికి కొత్తగా వచ్చానని, ఇక్కడ ఏం జరుగుతుందో పూర్తిగా తెలియడం లేదని ఆర్టీవో లాల్‌సింగ్ భరత్ చౌహాన్ తెలిపారు. గతంలో ఈ విధంగానే జరుగుతుండేదని, తాను వచ్చిన తర్వాత కొద్దిగా కంట్రోల్ చేశానని వివరించారు. ఇక్కడ ఓ అధికారితో పాటు సిబ్బంది మామూళ్లు తీసుకుంటున్న విషయం తనకు తెలిసిందని, వీరి వ్యవహార శైలిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

ప్రజలను పీడించి వసూళ్లు చేస్తున్నారు..



రాయచోటి ఆర్టీవో కార్యాలయానికి వెళ్లిన ప్రజలను ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ముక్కుపిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. దాదాపు ఏడాది కాలం నుంచి ఇలాగే జరుగుతున్నా పైఅధికారులు ఎవ్వరూ చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. లంచాలు తీసుకుంటున్న ఈ ఉద్యోగులను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలి. ఒక వెహికల్ ఓనర్ మరణిస్తే వారి కుటుంబ సభ్యులపై పేరు మార్చేందుకు రూ.5 వేలు తీసుకొని మారుస్తున్నారని నా దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వంలో పనిచేసిన సిబ్బందిని ఇకపైన ఇక్కడ ఉంచరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

- సిద్ధార్థగౌడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డ్రైవర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు

పెరుగుతున్న టమోటా ధరలు

● ములకలచెరువులో 22 కేజీల బాక్సు రూ.1200



ములకలచెరువు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, జూన్ 16: ములకలచెరువు మార్కెట్‌లో టమోటా ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఆదివారం మార్కెట్‌లో 22 కేజీల బాక్సు అత్యధికంగా రూ.1200 పలికింది. వేసవిలో ఎండ తీవ్రత టమోటా సాగుపై పడింది. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి శాతం భారీగా తగ్గిపోయి భూగర్భజలాలు తగ్గిపోవడంతో టమోటా సాగు భారీగా తగ్గింది. దిగుబడి భారీగా తగ్గడంతో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. 20 రోజులుగా టమోటా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. రెండు రోజుల క్రితం వరకు రూ.600 నుంచి రూ.వెయ్యి పలికిన బాక్సు ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. తాజాగా ఆదివారం నాణ్యతను బట్టి రూ.800 నుంచి రూ.1200 వరకు పలికింది. కిలో రూ.36 నుంచి రూ.54 వరకు పలికాయి. ఇక్కడి నుంచి టమోటాలు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు పట్టణాలకు ఎగుమతి అవుతున్నాయి. కాగా బయటి మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.80కు చేరింది.

ఆర్‌జేడీ అధికార దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

● విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఫిర్యాదు

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 16: కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న వై.రాఘవరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేశ్‌కు శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. ఆర్‌జేడీ రాఘవరెడ్డి కడప డీఈవోగా చాలా కాలం పనిచేశారని, ఆ సమయంలో వైసీపీకి అనుకూలంగా ఇష్టానుసారంగా బదిలీలు చేశారని ఆరోపించారు. అలాగే ఉపాధ్యాయులను దూషించడం, మహిళా టీచర్లతో అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకున్నా వాటికి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇవ్వని విధంగా టీచర్లు నిరసనలు చేయరాదని ఉత్తర్వులు కూడా ఇచ్చారన్నారు. 2023 మార్చిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేశారని, తాను ఎమ్మెల్సీ అయిన తరువాత దీనిపై ఫిర్యాదు చేస్తే ప్రతిగా ప్రెస్‌మీట్లు పెట్టి తన అంతు తేలుస్తానంటూ బెదిరించారని విమర్శించారు. కలెక్టరు, రాష్ట్ర గవర్నరును కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖలో అక్రమాలపై విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని లోకేశ్‌ను కోరారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన డీఈవో అనురాధపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి లోకేశ్‌ను కోరారు. గత కొన్ని నెలల క్రితం నంద్యాల జిల్లా నుంచి డీఈవోగా అనురాధ ఇక్కడికి బదిలీ అయ్యారని తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 16: గుర్రంకొండ మండలం చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు బక్రీద్ పండుగ

● సామూహిక ప్రార్థనల కోసం ముస్తాబైన ఈద్గాలు



పీలేరులో ఈద్గా వద్ద పందిళ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

పీలేరు, జూన్ 16: అల్లాహ్ ఆదేశం వచ్చినప్పుడు మనకు ఇష్టమైన వాటిని త్యజించడానికి సిద్ధంగా ఉండాలన్న త్యాగనిరతిని బోధించే పండుగ బక్రీద్. అరబ్బీలో 'ఈదుల్ అద్‌హా'గా చెప్పుకునే ఈ పండుగ బక్రీద్‌గా ప్రాచుర్యం పొందింది. దైవగ్రంథం ఖురాన్, మహాప్రవక్త హజరత్ మహమ్మద్ (స.అ.సం) హదీసుల ప్రకారం దైవప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగాన్ని స్మరించుకోవడంతో పాటు తమకు పవిత్ర హజ్ యాత్ర ప్రసాదించినందుకు కృతజ్ఞతగా ముస్లింలు ఇస్లాం క్యాలెండర్‌లోని చివరి మాసమైన జిల్‌హజ్జా మాసపు 10వ తేదీ బక్రీద్ పండుగ జరుపుకుంటారు. ఆ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగ జరుపుకోనున్నారు. 80 ఏళ్ల ముదసలి ప్రాయంలో లేకలేక కలిగిన ఏకైక సంతానమైన హజరత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంను దైవాజ్ఞ మేరకు బలి ఇవ్వడానికి సిద్ధపడతారు హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం. తన ఆజ్ఞ మేరకు ప్రాణం కంటే అమితంగా ప్రేమించే కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధపడిన హజరత్ ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగనిరతికి మెచ్చిన అల్లాహ్ చివరి క్షణంలో స్వర్గం నుంచి తెప్పించిన ఓ పొట్టేలును హజరత్ ఇస్మాయిల్ స్థానంలో పెట్టి ఆయనను కాపాడతారు. అప్పటి నుంచి ఖుర్బానీ ఇవ్వడం ఇస్లాంలో భాగమైంది. అలా ఇబ్రహీం, ఇస్మాయిల్ అలైహిస్సలాంలను త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ బక్రీద్ రోజున ముస్లింలు ఖుర్బానీ ఇస్తుంటారు. అయితే కేవలం జంతువులను ఖుర్బానీ ఇవ్వడమే కాకుండా అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రాపంచిక విషయాలను కూడా త్యజించడానికి సిద్ధంగా ఉండాలని ఖుర్బానీ ఉపదేశిస్తుంది.

ముస్తాబైన ఈద్గాలు

బక్రీద్ పండుగ సందర్భంగా ఆచరించే సామూహిక నమాజు కోసం జిల్లాలోని అన్ని ఈద్గాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని పీలేరు, మదనపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు వంటి ప్రధాన పట్టణాలతో పాటు చిన్నచిన్న గ్రామాల్లోని ఈద్గాలను ఆయా ఊళ్లలోని మసీదు కమిటీ సభ్యులు ఆదివారం శుభ్రపరిచారు. ఎండ వేడి ఎక్కువగా ఉండడంతో చాలాచోట్ల షామియానాలు ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో పీలేరు పట్టణం మదనపల్లె టర్నింగ్‌లోని ఈద్గా మైదానాన్ని ఆదివారం శుభ్రపరిచారు. సామూహిక నమాజు సోమవారం ఉదయం 8 గంటలకల్లా మొదలవుతుందని పీలేరు జామియా మసీదు ఇమామ్ ముఫ్తీ అబ్దుల్లా తెలిపారు. బక్రీద్ పండుగ నమాజును వీలైనంత త్వరగా ముగించాలన్న పెద్దల ఆదేశాల మేరకు ఆ సమయం నిర్దేశించామని ఆయన వివరించారు.

జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 16: మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలకు బక్రీద్ పర్వదినం అత్యంత ఆరాధ్యమైనది, ప్రీతికరమైనదన్నారు.ల ముస్లిం ఆరాధ్య గ్రంథం దివ్యఖురాన్ ప్రకారం సమాజంలో త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని వారు ఆకాంక్షించారు.

అంగన్వాడీల భవిష్యత్తు మెరుగుపడేనా!

● కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 16: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని చంద్రబాబు ప్రభుత్వానికి కాంగ్రెస్ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అంగన్వాడీ వ్యవస్థ మహోన్నతమైన వ్యవస్థ అని, ఇది కాంగ్రెస్ పార్టీ మానస పథకం అని పేర్కొన్నారు. బాల బాలికలలో, గర్భిణీలలో, బాలింతల్లో పౌష్టికాహార లోప నివారణ కోసం 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగన్వాడీ వ్యవస్థను ప్రారంభించారని తెలిపారు. వారికిస్తున్న గౌరవ వేతనం చాలా స్వల్పమన్నారు. పదవీ విరమణ తర్వాత వీరి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టినా గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కనీసం చంద్రబాబు ప్రభుత్వమైనా అంగన్వాడీల సమస్యల పట్ల దృష్టి పెట్టి వీలైనంత మేరకు వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు పాలన స్వర్ణయుగం

● మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తాం ● అందుకే ముఖ్యమంత్రి ఐదు సంతకాలు

● వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలపై విచారణ ● తప్పు చేసిన వారెవరైనా వదలం

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.. చిత్రంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాయచోటి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన స్వర్ణయుగం.. ఇందుకు నిదర్శనం గతంలో 14 సంవత్సరాలు ఆయన చేసిన పాలనే. ఇప్పుడు కూడా ఆదే ఒరవడిని ఆయన కొనసాగిస్తారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫేస్టోను కచ్చితంగా అమలు చేస్తాం. అందుకే ముఖ్యమంత్రిగా తొలి ప్రాధాన్యత కింద ఐదు సంతకాలు చేశారు. వీటివల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుంది. ప్రజలందరూ ఐదు సంవత్సరాల పాటు ప్రశాంతంగా ఎటువంటి అరాచకాలు, దౌర్జన్యాలు లేకుండా జీవించవచ్చని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఐదు సంవత్సరాల అరాచక పాలనతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని రక్షించుకునేందుకే ప్రజలు కూటమికి ఓటు వేశారని, ప్రజల ఆకాంక్షల మేరకు పాలన జరుగుతుందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు మెగా డీఎస్సీపైన ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం చేశారన్నారు. ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూసిన నిరుద్యోగులకు ఇది శుభవార్తే అన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు మేలు కలుగుతుందన్నారు.

జగన్ తన పాలనలో ఏనాడూ ఉద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. అదే విధంగా కొత్తగా ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రెండవ సంతకమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు వల్ల ప్రజలకు తమ భూములకు ఇక ఏమీ కాదనే ధైర్యం వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజలకు మేలు కలిగే ఒక జీవో కూడా రాలేదన్నారు. అయితే పేదల నోటికాడ మట్టి కొట్టే అనేక జీవోలు తెచ్చాడని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రి రద్దు చేశారని తెలిపారు. గతంలో పెన్షన్‌ను 2 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికలకు ముందు పెన్షన్‌ను ఒక్కసారిగా రూ.3 వేలకు పెంచుతానని జగన్ మాట ఇచ్చి తప్పాడని విమర్శించారు. సూపర్‌సిక్స్‌లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతూ సీఎం మూడవ సంతకం చేశాడన్నారు. దీనివల్ల వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇంకా పలువురికి ఆసరా దొరికిందన్నారు. పెన్షన్ రాని వికలాంగులంటూ రాష్ట్రంలో ఎవరూ ఉండకూడదనే ముఖ్యమంత్రి నిర్ణయం అమలు కావడానికి కృషి చేస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన పెద్ద పెద్ద స్కామ్‌లలో స్కిల్ డెవలప్‌మెంటు స్కాం కూడా ఒకటన్నారు. రాష్ట్రంలో కేవలం పది, పదిహేను కంపెనీలను ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంటును వనరుగా చూపి కోట్లు దండుకున్నారని గత ప్రభుత్వాన్ని విమర్శించారు. దీనివల్ల పేద ప్రజలు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులకు న్యాయం చేసేందుకే నాల్గవ సంతకం చేశారన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణనను చేస్తామన్నారు. దేవాలయాల వంటి అన్నా క్యాంటీన్లను కేవలం అక్కసుతోనే వైసీపీ నాయకులు దాడి చేసి మూసేసి పేదల నోళ్లు కొట్టారన్నారు. అందుకే ప్రజల ఉసురు తగిలి ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయిందన్నారు. పేదల కోసమే ఐదవ సంతకం ఈ పథకం తిరిగి మొదలు పెట్టడానికి చేశారని పేర్కొన్నారు.

రవాణా శాఖ ద్వారా ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 4700 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు లేని రాష్ట్రంగా చేయడానికి కృషి చేస్తానన్నారు. రాయచోటి నియోజకవర్గంలో కూడా నెలకు కనీసం 20కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఎటువంటి సమస్యలు లేకుండా అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న కర్నాటక, తెలంగాణా రాష్ట్రాలలో కొన్ని సమస్యలు ఉన్నాయని, తమ శాఖ బృందం ఆయా రాష్ట్రాలలో పర్యటించి పది రోజులు ఆలస్యమైనా సక్రమంగా అమలు జరిగే విధంగా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. క్రీడా శాఖలో ఐదు సంవత్సరాలలో చేసిన స్కాంపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల డబ్బు తిన్న వాళ్ల ఊచలు లెక్కించక తప్పదని హెచ్చరించారు. యువత మానసికంగా, శారీరకంగా, దృఢంగా ఉండేవిధంగా క్రీడలను ప్రోత్సహిస్తామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్నమయ్య నిర్వాసితులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాయచోటి నియోజకవర్గంలో అసైన్‌మెంటు కమిటీ ద్వారా నిజమైన పేద రైతులకు న్యాయం జరగలేదని తెలిపారు. కేవలం వైసీపీ వాళ్లకే భూములు కట్టబెట్టారని విమర్శించారు. పేదల నుంచి అధికారులు వేలాది రూపాయలు లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. అసైన్‌మెంటు కమిటీలో జరిగిన అవకతవకలపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చేసిన అక్రమాలపై విచారణ జరిపించి తిన్నదంతా కక్కిస్తామని అన్నారు. మంత్రితో పాటు సమావేశంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

గండిలో నిత్యాన్నదానానికి లక్ష విరాళం


ఆలయ కమిటీ చైర్మన్‌కు లక్ష రూపాయలు విరాళం అందిస్తున్న పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా సరళమ్మ

కమలాపురం రూరల్, జూన్ 16: గండి క్షేత్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కమలాపురం వాసి కంకర సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి విజయం సాధిస్తే నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళం ఇస్తామని మొక్కుకున్నామన్నారు. గెలుపొందడంతో మొక్కు చెల్లించుకునేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆయన తల్లి పుత్తా సరళమ్మ చేతుల మీదుగా కంకర సుబ్బారెడ్డి దంపతులు అన్నదానానికి రూ.1,00,016లు అందించి మొక్కుబడి తీర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో పుత్తా సాయినరసింహారెడ్డి, గొంగల్‌రెడ్డి దివాకర్‌రెడ్డి దంపతులు మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్లకు తాళాలు

ఇబ్బందుల్లో ప్రజలు ● తెరిపించాలని వినతి


కోట వీధి వాటర్‌ప్లాంట్‌కు తాళం - నీళ్లకోసం వచ్చి వెనక్కి వెళుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 16: మున్సిపాలిటీ వాటర్‌ప్లాంట్లను సంబంధిత అధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. కొంత కాలంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఒక క్యాన్ మూడు రూపాయలతో అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అందులో వైసీపీ చోటా నేతల అధీనంలో ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులు ఆ వాటర్‌ప్లాంట్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. అయితే మున్సిపాలిటీకి సంబంధించి వాటర్‌ప్లాంట్లు ఉండడం వలన ప్లాంట్లకు వినియోగించిన కరెంటు బిల్లులు లక్షల్లో పెండింగ్ ఉన్నందు వలన వాటర్ ప్లాంట్లకు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. అయితే కరెంటు బిల్లులకు సంబంధించిన సమస్య, మున్సిపాలిటీ అధికారులు పరిష్కరించి ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఒకవేళ ఇతరులు ముందుకు వచ్చి వారికి అప్పగిస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు ఉండవని త్వరగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వాటర్‌ప్లాంట్ల వద్దకు వచ్చిన జనాలు తాళాలు వేయడం వలన వెనుతిరిగి వెళుతున్నారు.

భగీరథ ప్రయత్నం

వెయ్యి అడుగులు తవ్వినా కనపడని నీటి జాడ ● అందని వైఎస్ఆర్ జలకల?'

అడుగంటిన భూగర్భజలాలు - తీవ్ర ఇబ్బందుల్లో రైతులు ● వెలిగల్లు నుంచి సాగునీరు అందించాలని వినతి

గాలివీడు, జూన్ 16: దివి నుంచి భువికి భగీరథుడు గంగను తీసుకొచ్చినట్లు మండల రైతులు నీటి కోసం భగీరథుడిలా అనేక యత్నాలు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వెయ్యి అడుగులకు పైగా తవ్వినా నీటి జాడలేదని వాపోతున్నారు. మన జిల్లా వాసి ముఖ్యమంత్రి అయితే మన మండలం కొద్దిమేరకైనా అభివృద్ధి చెందుతుందని ఆశపడిన ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో నిరాశే ఎదురైంది. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకల పథకం రైతులకు కలగా మిగిలింది. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లున్నా చెరువులు, భూములకు నీళ్లు అందంచలేదని దుస్థితిలో ప్రభుత్వం నిలిచిపోయింది. దేశానికి రైతే వెన్నెముక, రైతు లేనిదే రాజ్యము లేదు, రైతుతోనే దేశం సుభిక్షం అనేవి నినాదాలుగా మారాయే తప్ప రైతుకు కావాల్సిన నీరు దొరకడం లేదు. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే నీరు అవసరం. భూములకు నీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. చేసేది లేక వ్యవసాయంపై మక్కువ సంపుకోలేక రైతులు లక్షలు వెచ్చించి బోరుబావులు వేసినా నీటి చుక్క కనపడలేదు. దీంతో అప్పు చేసి బోరుబావులు వేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. వివరాల్లోకెళితే...

మండలంలో 25 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అన్ని గ్రామ పంచాయతీల్లో 150కి పైగా కుంటలు, చెరువులున్నాయి. వీటితో పాటు వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టులున్నాయి. వీటి కింద 10 వేల ఎకరాలు సాగు భూమి కలదు. ఎలాంటి నీటి ఆధారం లేకుండా 15 వేల ఎకరాల మెట్టభూమి కలదు. కుంటల కింద ముఖ్యంగా వరి, జొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలను సాగు చేస్తారు. నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో వేరుశనగ, కంది, ఉలవ, పొద్దుతిరుగుడు, అరటి, జామ, సపోటా, మామిడి, నిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.

వెయ్యి అడుగులు తవ్వినా....

ఈ ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మండలంలో కరువు ఛాయలు నెలకొన్నాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షపాతం చాలా తక్కువ శాతం నమోదవడంతో రైతులు పంటలను సాగు చేయలేకపోయారు. నూలివీడు, సీసీపల్లె, గుండ్లచెరువు, పేరంపల్లె, గోపనపల్లె, ఎగువగొట్టివీడు, పూలుకుంట, గోరాన్‌చెరువు, అరవీడు పంచాయతీల్లోని సాగు భూములకు వెలిగల్లు నుంచి నీటి పారుదల సౌకర్యం లేదు. దీంతో రైతులు పంటల సాగు కోసం, మామిడి తోటలను కాపాడుకోవడం కోసం వెయ్యి అడుగుల వరకు బోరు వేసినా నీళ్లు పడని పరిస్థితి నెలకొంది. వెయ్యి అడుగులు బోరు వేయాలంటే కేవలం బోరుకు మాత్రమే రెండు లక్షలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. ఇటీవల మండల వ్యాప్తంగా మామిడి తోటల పెంపకం ఎక్కువైంది. ప్రతి గ్రామంలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో రైతులకు ఉన్న బోరుబావులు అన్నీ నీళ్లు లేక ఎండిపోయాయి. బోరుబావులు అడుగంటిపోవడంతో మామిడి తోటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు రైతులు పది కొండు వందల అడుగులపైన బోరు వేసినా నీళ్లు పడలేదని చేసేది ఏమీ లేక ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీళ్లు తోలుకున్నామని వాపోతున్నారు. ట్యాంకర్ రూ.650 పెట్టి మామిడి చెట్లు, నీళ్లు తోలుకున్నాయని, అలా నెలకు మూడు సార్లు తోలామన్నారు. చెట్లను కాపాడుకోవడం కోసం బోరుబావుల కోసం నీటి ట్యాంకర్ల కోసం లక్షలు ఖర్చు చేశామని రైతులు వివరించారు. ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకల పథకం రైతులకు కలగా మారిపోయింది.


వెయ్యి అడుగులు వేసినా నీటి చుక్క పడని వ్యవసాయ బోర్లు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుకు శాపం

2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తాగు, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లున్నా చెరువులు, భూములకు అందంచలేని దుస్థితిలో ప్రభుత్వం నిలిచిపోయింది. తాగు, సాగునీరు అందించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా వారు ఏ కోశాన పట్టించుకోలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాల్లో కనీసం చెరువులకు నీటిని సరఫరా చేసి ఉంటే ఈ రోజు ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదురయ్యేది కాదన్నారు. నీళ్లు ఉన్నా ఈ రోజు సాగు భూములకు నీళ్లు అందించలేక పోవడంతో తాము లక్షల్లో నష్టపోయామని, దీనికంతటికీ కారణం వైసీపీ ప్రభుత్వం అవలంబించిన రైతు వ్యతిరేక విధానాలేనని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వమైనా వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించి మమ్మల్ని కాపాడాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెయ్యి అడుగులు వేసినా....



12 ఎకరాల భూమిలో 600 మామిడి చెట్లు నాటాము. వీటికి నీళ్లను సరఫరా చేయడానికి ఆరు బోర్లు వేశారు. ఒక్కో బోరు వెయ్యి అడుగులకుపైనే ఉన్నవి. కానీ నీళ్లు పడలేదు. ఈ ఏడాది మార్చిలో కూడా వెయ్యి అడుగుల బోరు వేశాను. రెండు లక్షలు ఖర్చు అయ్యింది. అయినా చుక్క నీరు కూడా పడలేదు. చెట్లను కాపాడుకోవడం కోసం ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీటిని తోలుకుంటున్నారు. 600 చెట్లకు ఒక్కో సారి వంద ట్యాంకర్ల నీటిని తోలారు. నెలకు మూడు సార్లు చొప్పున మూడు నెలలు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకున్నాము. ఒక్క తడికి రూ.65 వేలు నెలకు మూడు తడులుకు గానూ రూ.1.95 వేలు మూడు నెలలకు ఐదు లక్షల 85 వేల రూపాయలు ఖర్చు చేశాను. టీడీపీ ప్రభుత్వం మామిడి తోటలను కాపాడుకోవడానికి నీటి సరఫరాకు ఎకరాకు ఇంత చొప్పున డబ్బులను అందజేసింది. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రూపాయి కూడా అందచేయలేదు.

నక్కల యోగాంజుల్ రెడ్డి, నక్కలవాండ్లపల్లె, నూలివీడు

ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించాలి



వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా చెరువులు, బావులకు, సాగునీరందించాలి. ఈ ఏడాది మండలంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మామిడి తోటలను కాపాడుకోవడం తలకు మించిన భారమైంది. పంటల సాగు కోసం 5 వ్యవసాయ బోర్లు వేశాను. కానీ బోర్లు అన్నీ ఎండిపోయాయి. బోర్లు వేయడం వల్ల లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది.

వెంకట్రమణ, గుర్రంవాండ్లపల్లె, సీసీపల్లె

రోడ్డు ప్రమాదంలో బండి రామచంద్రయ్య మృతి


రామ చంద్రయ్య (ఫైల్‌ఫొటో)

మైదుకూరు, జూన్ 16: స్థానిక నంది, భారతి, కొండ స్వామి విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి రామ చంద్రయ్య (58) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పట్టణ సమీప బైపాస్‌లో ద్విచక్ర వాహనంలో మైదుకూరు వైపు వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో 108లో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణంలో మూడు విద్యాసంస్థలు నిర్వహిస్తుండంతో అందరికీ సుపరిచితుడు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, లారీ ఢీ - ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

పుల్లంపేట, జూన్ 16: పుల్లంపేట బైపాస్ రోడ్డులో ఎస్‌వీ కల్యాణ మండపం వద్ద ఆదివారం కారును లారీ కొనడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. పోలీసుల కథనం మేరకు మేరకు మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా రత్నమాల నివాసులు నలుగురు తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పుల్లంపేట వద్ద లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా వెనుకవైపు లారీ కారును బలంగా ఢీకొంది. అదే సమయంలో ఎదురుగా చెన్నై నుంచి వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ కూడా కారును ఢీకొనడంతో కారు పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ విశ్వనాథ్ చంద్రకాంత్, సంతోష్ రఘు, నందిని స్వల్పంగా గాయపడ్డారు. కారులో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. రఘురాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన బాలకృష్ణ

సంబేపల్లె, జూన్16: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిపై మోటకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీ వాసి బాలకృష్ణ తన ద్విచక్రవాహనంలో సంబేపల్లి వైపు నుంచి రాయచోటికి వస్తుండగా అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తాపడింది. సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● జిల్లాస్థాయి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే చైతన్యరెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 16: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పేరుపేరునా పరిచయం చేసుకుంటూ అభినందనలు తెలిపారు. ముందుగా టీడీపీ అభిమానులు, చైతన్యరెడ్డి పుట్టినరోజు వేడుకలను ముందస్తుగా ఆయనతో భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, బీసీ నేత గోపాల్‌యాదవ్, శంకర్‌యాదవ్, దాదిరామయ్య, నబీరసూల్, వివిధ ప్రాంతాల టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వమైనా మాదే దందా

ఇసుక అక్రమ రవాణా నిలువరించలేరా? ● అధికారుల నిర్లక్ష్యానికి మతలబేంటి

పెన్నానది నుంచి యథేచ్ఛగా సాగుతున్న దందా ● స్పందించని జిల్లా అధికారులు


ఆర్డీఓ కార్యాలయం మీదుగా రాత్రి తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్ - గాంధీ విగ్రహం వద్ద తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్

జమ్మలమడుగు, జూన్ 16: ఏ ప్రభుత్వమైనా మేము చెప్పిందే వేదమని, మేము చేసేదే దందా అనేలా ఇసుక మాఫియా వ్యవహరిస్తోంది. ఇసుక అక్రమ రవాణా జరగుతున్నా యదేచ్ఛగా దందా సాగుతోంది. జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా ఆపేదెవరో చూద్దామని ఇసుక అక్రమ రవాణా చేసే యజమానులు, డ్రైవర్లు సవాల్ విసురుతున్నారు. మండలంలోని పెన్నానది పరిసర ప్రాంతాల్లో 4 నుంచి 5 చోట్ల ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లకు ఇసుక నింపి ప్రధాన రోడ్లపైనే అధికారుల కార్యాలయాల ఎదురుగానే తరలిస్తున్నారు. వివరాల్లోకెళితే....

ముద్దనూరు రోడ్డులోని పెన్నానది సమీపం నుంచి సాయంత్రం ఏడు గంటలకు తోడేళ్లలాగా పెన్నానదిలో చేరి అక్రమ ఇసుక రవాణా అధిక స్పీడుతో పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం, పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద నుంచి మార్కెట్ రోడ్డుమీదుగా నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం తేరు రోడ్డు మీదుగా బయటి ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు. గూడెం చెరువు, పొన్నతోట, అంబవరం, గొరిగెనూరు, పి.సుగుమంచిపల్లె, దానవులపాడు, పెన్నానది పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా దందా సాగుతోంది. మండలంలోని మోరగుడి గ్రామం, మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం పెన్నానది నుంచి ఇసుక రాత్రి సమయాల్లో వందల ట్రాక్టర్లు ఇసుక తరలిపోతోంది. ఇదంతా జమ్మలమడుగు, మైలవరం, ప్రాంతాల్లోని సంబంధిత అధికారులు, ఇతర అధికారులు కంటపడుతున్నా ఎవరు పట్టించుకోకపోవడానికి మతలబేంటో తెలియక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఎదురుగానే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఎందుకు స్పందించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు ఇసుక మాఫియాకు సంబంధించిన యజమానులను ఇసుక ట్రాక్టర్లు అధిక స్పీడుతో వెళుతున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎలాగని అడిగినా దిక్కున్నచోట చెప్పుకోమని తాము ఇదే స్పీడుతోనే వెళతామని కొందరు చెప్పినట్లుగా జమ్మలమడుగు పాత బస్టాండు, కూరగాయల మార్కెట్‌వీధిలో చెప్పినట్లు ప్రజలు వాపోతున్నారు. రాత్రిళ్లు పోలీసు సిబ్బంది గస్తీ తిరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు ఇసుక ట్రాక్టర్లపై అప్పట్లో తిరిగిన టిప్పర్లపై ఎవరూ చర్యలు తీసుకోకపోవడంతో మాఫియా జోరు పెంచిందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా జమ్మలమడుగులోని పోలీసు అధికారులు జిల్లాలోని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇసుక మాఫియా కొందరు అధికారులతో మాట్లాడుకుని తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలని పెన్నానదీ పరిసర ప్రాంత ప్రజలు, పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

కొండాపురం, జూన్ 16: తిమ్మాపురం సమీపంలో స్కూటరిస్టుకు గాయలయ్యాయి. ఆదివారం కృష్ణారెడ్డి కొండాపురం నుంచి లావనూరుకు స్కూటర్‌లో వెళుతుండగా స్కూటర్ పంచర్ అయింది. దీంతో కృష్ణారెడ్డికి పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఇతను బేల్దారి పని చేస్తున్నట్లు తెలిసింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

పుల్లపేంట, జూన్ 16: పుత్తనవారిపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం మోటారు బైకును ఢీకొనడంతో కొట్టం శివ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయంత్రం గాదెలకు చెందిన శివ బైకుపై రాజంపేటకు బయలుదేరాడు. పుత్తనవారిపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కాలు పూర్తిగా తెగిపోయింది. దీంతో పుల్లంపేట పోలీసులు శివను 108లో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కలసపాడులో చోరీ

కలసపాడు, జూన్ 16: మండల కేంద్రమైన కలసపాడులో చోరీ జరిగినట్లు ఎస్ఐ నాగముని తెలిపారు. వెంకట్రామిరెడ్డి మూడురోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. శనివారం సాయంత్రం తిరిగి రాగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగలగొట్టబడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఎనిమిది తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్‌కు నిప్పు

పెండ్లిమర్రి, జూన్ 16: పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌కు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఉద్దేశపూర్వకంగా టిప్పర్‌కు నిప్పు అంటించారని టిప్పర్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చాపాడు ఎస్ఐ కొండారెడ్డి వీఆర్‌కు

కడప (క్రైం), జూన్ 16: చాపాడు ఎస్ఐ ఎస్‌వీ కొండారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో అధికార పార్టీకి సహకరించడం, టీడీపీ నేతపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆరోపణలు రావడంతో ఆయనను వీఆర్‌కు బదిలీ చేశారు.

జూలై 1 నుంచి ఎల్ఎల్‌బీ రెగ్యులర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16: వైవీయూ పరిధిలోని ఎల్ఎల్‌బీ (ఐదేళ్ల, మూడేళ్ల) విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు జూలై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల బీపీఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ 1వ సెమిస్టరు పరీక్షలు 1, 3, 5, 8, 10 తేదీల్లో జరుగుతాయన్నారు. 3, 5ఏళ్ల ఎల్ఎల్‌బీ సప్లిమెంటరీ పరీక్షలు ఇదే తేదీల్లో ఉంటాయన్నారు. వైవీయూ కేంద్రంగా జరిగే ఈపరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

గంగమ్మ ఆలయంలో నగలు చోరీ

కొండాపురం, జూన్ 16: గండ్లూరు గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో నగలు చోరీకి గురయ్యాయి. గుడిలో గంగమ్మ తల్లికి అలంకరించిన వెండి కిరీటం, వడ్డాణం శుక్ర వారం మధ్యాహ్నం అపహరించుకుని వెళ్లినట్లు స్థానికులు తెలి పారు. కాగా వీటి విలు వ సుమారు రూ.50,000 వరకు ఉం టుందని గుడి నిర్వాహ కులు తెలిపారు. గుడిలో ఎవరూ లేనిది గమనించి వీటిని దొంగిలించినట్లు తెలుస్తోంది. గుడిలో ఎవరూ లేనప్పుడు తాళలు వేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గుడిలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి టౌన్, జూన్1 6: ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం వారు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డీఎస్సీపై సంతకం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. సీపీఎస్ విధానం రదుతో పాటు, రిటైర్మెంట్ రోజునే అన్ని రకాల బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ పీఆర్‌సీ అమలయ్యేలోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని, 117 జీవోను రద్దు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, మాతృభాషలోనే బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష మీడియం కొనసాగించాలని,ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్‌ఎస్) అన్ని రకాల వ్యాధులకు అన్ని రకాల ఆసుపత్రులకు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దశాబ్దాలుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న ఏకీకృత రూల్స్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలతో పాటు కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

రాయచోటిటౌన్, జూన్ 16: వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27 రకాల దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని దళిత హక్కుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కోశాధికారి హరికుమార్, మండెం సుధీర్‌కుమార్, చుక్కా వీరభద్ర ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దళిత సంక్షేమ పథకాలను రద్దు చేయడం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దళితుల ఆర్థిక అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27 రకాల దళిత పథకాల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా దళిత హక్కుల పోరాట సమితితో పాటు అనేక దళిత, గిరిజన బలహీన వర్గాల సంఘాలు ఆందోళనలు చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అయినా వైసీపీ రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించి 27 రకాల దళిత పథకాలను కొనసాగించాలని వారు మంత్రి మండిపల్లికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మండిపల్లికి వినతి పత్రం అందజేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నేతలు



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజంపేట తెలుగుదేశంపార్టీ నాయకులు

మంత్రిని కలిసిన సుగవాసి ప్రసాద్‌బాబు

నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ మాజీ పాలక మండలిసభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఏకాంతంగా పలు విషయాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లింలకు మండిపల్లి బక్రీద్ శుభాకాంక్షలు

త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, అలవర్చుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతల శుభాకాంక్షలు

పట్టణంలోని మండిపల్లి భవన్‌లో ఆదివారం అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంత, అన్నమయ్య జిల్లా పీఈటీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, హెడ్ క్వార్టర్ సెక్రటరీ లలితమ్మ, మీడియా కోఆర్డినేటర్ రెడ్డెయ్య మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీడీలు దేవకమ్మ, చక్రపాణి, అంజి, వరదరాజు, కరుణాకర్, ఉపాధ్యాయులు విశ్వనాథ, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సుండుపల్లెకు బస్సు సౌకర్యం కల్పించాలి

సుండుపల్లె: విద్యార్థులు, రైతులు, ప్రజల సౌకర్యార్థం సానిపాయి, సుండుపల్లె మీదుగా పీలేరుకు బస్సు సౌకర్యం కల్పించాలని జనసేన నేత రామాశ్రీనివాస్ మంత్రి మండిపల్లికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు టీడీపీ పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు తెలిపారు. మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు రెడ్డనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన లక్కిరెడ్డిపల్లె నేతలు, కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కలిసి గజమాలతో సన్మానించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్, ఏ1 కాంట్రాక్టర్ పాపయ్య, సిద్దక వెంకటరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శంకరాపు జయరాం, సుధీర్, ఆరీపుల్లా, డాక్టర్ షఫీనాయక్, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు ఓబులేసు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అంకన్న, పక్కీరయ్య, మండ్ల రామాంజనేయులు, మూగి వెంకటరమణ, ప్రతాప్‌రెడ్డి, వేమయ్య, వెంకటేశ్వర్లు కార్యకర్తలు తదితరులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

రాజంపేట టీడీపీ నేతల భేటీ

రాజంపేట: రాష్ట్ర, రవాణా, క్రీడా యువజన శాఖామాత్యుడు నడింపల్లె రాంప్రసాద్‌రెడ్డితో ఆదివారం రాజంపేట టీడీపీ నేతలు భేటీ అయ్యారు. మంత్రిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్‌వి రమణ, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, దంత వైద్యుడు డాక్టర్ నవీన్, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, జూన్ 16: పేద ప్రజల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన హామీల అమలుపై తొలి సంతకం చేశారని రాజంపేట టీడీపీ ఇన్ చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం సుండుపల్లె మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్‌మోహన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పారన్నారు.. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్న ఆశతో నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులు, రైతులు, ఉద్యోగులు కూటమికి అఖండ విజయాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు ప్రసాద్‌రాజు, శివరాంనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, మేకల మహబూబ్‌బాషా, మాలేపాటి సురేశ్‌నాయుడు, కిరణ్, మంగిరి రమణయ్య, మస్తాన్ బాబు, నాగసుబ్బయ్య, సిద్దయ్య, జనసేన మండల మహిళా నాయకురాలు రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 16: ఆధ్యాత్మి క కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోడూరు విశ్వ హింద ూపరిషత్ ప్రఖండ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి తెలిపారు. ఆది వారం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం లో విశ్వహిందూపరిషత్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ సిద్ధాంతాలను తప్పకుండా ఆచరించాలన్నారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు అందరూ హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో భక్తిభావాలను పెంపొందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏయే కార్యక్రమాలు చేయాలని చర్చించుకున్నామని తెలిపారు. గ్రామాల్లో విశ్వహిందూపరిషత్ శాఖలను ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేయాలని, గోవధ చేయరాదని, గ్రామాల్లో స్త్రీ శక్తి ఏర్పాటు చేసి అక్కడ చిన్నివయసులోనే భక్తి భావం ఏర్పాటు చేయాలని విశ్వహిందూపరిషత్ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు తదితర మండలాలకు చెందిన ప్రఖండ సభ్యులు పాల్గొన్నారు.

30 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు అర్హులను ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జూన్ 16: స్థానిక చెన్నముక్కపల్లెలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 30 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, శివరామిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

కలికిరి, జూన్ 16: మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురంలో ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు నడివీధి గంగమ్మకు దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గ్రామస్తులంతా బిందెలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ జాతరలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి తనూజా రెడ్డి పాల్గొన్నారు. మాజీ సర్పంచు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కిశోర్‌కుమార్ రెడ్డి దంపతులకు ఘనంగా స్వాగత సత్కారాలు అందజేశారు.

ఎగువ గిండి గంగమ్మ జాతర

తంబళ్లపల్లె, జూన్ 16: స్థానిక గోపిదిన్నె బస్టాప్ వద్ద వెలసిన ఎగువ గిండి గంగమ్మ జాతరను ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి దివ్వెలూ, బోనాలూ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వివిధ గ్రామాల వారు చాందిని బండ్లను ఆలయం చుట్టూరా తిప్పారు.

మీ-సేవా కేంద్రాలను బతికించండి

పీలేరు, జూన్ 16: గత ప్రభుత్వ నిరాదరణ కారణంగా దాదాపు మూసివేత దశకు చేరుకున్న మీ-సేవా కేంద్రాలను మళ్లీ బతికించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని పీలేరులోని పలువురు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందజేశారు. 2019కు పూర్వం మీ-సేవా కేంద్రాలలో అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేవని, గత ప్రభుత్వం అధిక శాతం సేవలు తీసి వేయడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ చంద్రబాబు మానసపుత్రికలైన మీ-సేవా కేంద్రాలకు జవసత్వాలు లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఆయనను ఘనంగా సన్మానిం చారు. మహమ్మద్ పీర్, జ్ఞానంగారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గేటు సమీపంలోకి మార్చాలి

- సీపీఐ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు

గాలివీడు, జూన్ 16: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గేటు సమీపంలోకి మార్చాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యకర్తలతో కలిసి పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 17 గ్రామ పంచాయతీలకు అనువైన గేటు ప్రాంతంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చడం ద్వారా చుట్టుపక్కల గ్రామ పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పట్టణానికి దూరంగా శ్మశాన వాటిక పక్కన ఉండడంతో జబ్బు చేసిన ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. ఆసుపత్రి దూరంగా ఉండడంతో పలువురు ఆర్‌ఎంపీల దగ్గరికి వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇలాంటి పేద ప్రజలందరికీ వైద్యం అందుబాటులోకి రావాలంటే గేటు సమీపంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు కృష్ణమూర్తి, భాస్కర్, దీపక్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.



పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం వద్ద మాట్లాడుతున్న సీపీఐ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



సమావేశమైన బీజేపీ నాయకులు

పుల్లంపేట, జూన్ 16 : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు గండికోట రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తనవారిపల్లెలో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. దేశంలో మూడోసారి మోడీ నాయకత్వంలో అధికారం చేపట్టడంతో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయులు కంభాల శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి పరమేష్, రాంప్రసాద్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రయ్య, వై.సుబ్బయ్య, శంకర్‌రాజు, మహాలక్ష్మీ, చంద్ర పాల్గొన్నారు.

మల్లాలమ్మకు టీడీపీ నేతల మొక్కుల చెల్లింపు

ఓబులవారిపల్లె, జూన్ 16 : రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో కాకర్లవారిపల్లె గ్రామ ప్రజలు మల్లాలమ్మకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి టెంకాయ కొట్టి 101 టెంకాయలు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బోటుమీదపల్లె సర్పంచ్ వీరపనేని వెంకటయ్యనాయుడు, మాజీ సర్పంచ్ చుండూరు రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో అన్నదాన ం చేశారు. ఈ సందర్భంగాముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ వీరాభిమానుల పట్టుదల, కృషితో నియోజకవర్గంలో అరవ శ్రీధర్‌ను, రాష్ట్ర ప్రజలు తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, రమణారెడ్డి, గుండయ్యనాయుడు, జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, పగడాల వెంకటేశ్, బోటుమీదపల్లె గ్రామ పంచాయతీ ప్రజలు, యువకులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి

పుట్టా అనుచరుల తిరుమల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కార్యకర్తలకు స్వాగతం పలుకుతున్న భాకరాపేట నాయకులు

సిద్దవటం, జూన్ 16 : కాలినడకన తిరుమల వెళుతున్న మైదుకూరు శాసనసభ్యుడి అనుచరులు భీమయ్యయాదవ్, కిషోర్, సుబ్బరాయుడుయాదవ్ మరికొంతమంది ఆదివారం బాకరాపేటమీదుగా వెళుతుండగా స్థానిక టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, పెద్దపల్లె గ్రామ సర్పంచ్ ప్రతినిధి తూర్ర ప్రతాప్‌నాయుడు, లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి బాట పట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి చూసి వైసిపి నాయకులు బుద్ధి తెచ్చుకోవాలన్నారు.

సత్యమ్మకు పొంగుబాళ్లు



పూజలందుకుంటున్న పోతులరాజుల విగ్రహాలు

చిట్వేలి, జూన్ 16 : మండల కేంద్రంలోని సత్యమ్మ వీధిలో ఆదివారం సత్యమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగుబాళ్లు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చౌడవరం రంగారెడ్డి కుటుంబ సభ్యులు ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. సోమవారం అమ్మవారికి పూజల అనంతరం మధ్యాహ్నం చౌడవరం రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు కెకె చౌదరి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, గుత్తి నరసింహ, ఎంపీటీసీ సభ్యుడు నాగార్జున, కాకర్ల నాగార్జున, బొక్కసం సునీల్, శివరామరాజు, చెంగల్‌రాయుడు, నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా మారెమ్మకు పొంగళ్లు

నందలూరు, జూన్ 16 : మండలంలోని నాగిరెడ్డిపల్లె లో ఆదివారం మారెమ్మకు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అత్యంత సుందరంగా పూలు, నగలతో అలంకరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు యల్లటూరి శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. వీరితో పాటు డేరంగుల శివయ్య, రమేష్‌రెడ్డి, రుద్రసాయి, చొక్కరాజు సాయి, పొగడ్త శ్రీను, రామిశెట్టి శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్తలు సింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గారెడ్డి, నాగిరెడ్డిపల్లె గ్రామ ప్రజలు, మహిళలు పెద్దఎత్తున పొంగళ్లు సమర్పించారు. ఎస్ఐ మహ్మద్‌అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమనీయంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వర కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సుండుపల్లె, జూన్ 16: మండలం లోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ చిన్న బిడికీలోని శ్రీరామ్ బాలాజీ వెంకటేశ్వర స్వా మి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వేంకటే శ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిం చారు. హాజ రైన భక్తులకు అదే గ్రామానికి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌నాయక్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు ఎమ్మెల్యే పరామర్శ

పుల్లంపేట, జూన్ 16 :ప్రమాదవశాత్తూ గాయపడిన రెడ్డిపలెకు చెందిన నరసాపురం సుబ్బన్నను ఆదివారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శ్మశానానికి ప్రహరీగోడ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కాపర్ల చంద్రశేఖర్‌నాయుడు, వెంకటసుబ్బయ్యయాదవ్, ప్రేమ్‌కుమార్, నరసింహులు, సుదర్శన్, జనసేన నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలేజీలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 16: మండలంలోని ఏపీ మోడల్ కాలేజీలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. విద్యార్థి తల్లి,తండ్రీ ఆధార్ కార్డులతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, జూన్16: నాగారపమ్మ తిరుణాలలో భాగం గా అమ్మవారికి పూజలు, అభిషేకం అనంతరం జల్డి సాంగ్యం నిర్వహించారు. ఆదివారం ఉదయం రజకులు పుట్ట బంగారాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున వరపడ్డారు. విరూపాక్షమ్మకు చల్లబోనం, పుట్టల ఎల్లమ్మ వద్ద పూజలు నిర్వహించారు. రాత్రికి ఆసాది వారు అమ్మవారి కథ వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం రాత్రి చాందినీ బండ్ల దర్శనం ఇవ్వనున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయనున్నారు.

చౌడమ్మకు మొక్కుల చెల్లింపు



చౌడేశ్వరికి టెంకాయలు సమర్పిస్తున్న టీడీపీ నేతలు

గాలివీడు, జూన్ 16: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, కేబినెట్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎన్నికైనందుకు పూలకుంట, బోరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలకుంటలో వెలసిన చౌడేశ్వరికి ఆదివారం 303 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రిగా, రాయచోటి నియోజకవర్గానికి ప్రథమంగా రాముడు మంత్రిగా ఎన్నిక కావడంతో స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, మాజీ వాటర్ షెడ్ ఛైర్మన్ రెడ్డిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజనమ్మ, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ కొండారెడ్డి, మహిళా నాయకురాలు సులోచనమ్మ, యువగళం సభ్యులు సాయి ప్రసాద్ రెడ్డి, టీడీపీ నాయకులు రామాంజులరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివశంకర్, వీరాంజనేయులు, అశోక్, పద్మనాభ, శివకృష్ణ, దళిత నాయకులు వెంకట్రమణ, మల్లికార్జున, రమణ పాల్గొన్నారు.



తిరుమలలో తరగని రద్దీ

మెలికలు తిరిగిన క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు



సీఆర్వో వద్ద గుమికూడిన భక్తులు

తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి ఆలయ పరిసరాలు, మాడవీధులు, బస్టాండ్, లేపాక్షి సర్కిల్, లడ్డూ కౌంటర్, పాపవినాశనం, శ్రీవారిపాదాలు వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మరోవైపు అలిపిరి, శ్రీవారిమెట్ల మార్గాల్లో భక్తులు అధిక సంఖ్యలో కొండకు తరలివస్తున్నారు. గదులకు డిమాండ్ కొనసాగుతుండటంతో భక్తులు కార్యాలయాల ముందు, షెడ్లు, చెట్లకింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. గదుల కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. కల్యాణకట్టల్లోనూ యాత్రికుల సందడి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాదనీరాజనం ముందున్న షెడ్‌లో సేదతీరుతున్న యాత్రికులు

టీటీడీ ఈవోగా శ్యామలరావు
బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో(కార్యనిర్వహణాధికారి)గా శ్యామలరావు ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈవోగా నియమితులైన ఆయన తన సతీమణితో కలిసి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా వైకుంఠ క్యూకాంప్లెక్స్‌కు వెళ్లారు. క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన రంగనాయమండపంలో టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను అందుకున్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరిగి రంగనాయక మండపానికి చేరుకున్న నూతన ఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత జేఈవో వీరబ్రహ్మం శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.



నూతన టీటీడీ ఈవోకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈవో వీరబ్రహ్మం



శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్యామలరావు



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న ఈవో

నీటిలో మట్టిలా కనిపిస్తోంది

క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఇచ్చే నీటిలో కొంచెం మట్టిలా కనిపిస్తోందని, దీనిపై పరిశీలన చేస్తామని ఈవో అన్నారు. క్యూలైన్ల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాలు అన్ని చోట్లా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు క్యూలైన్లలోని భక్తుల నుంచి అందాయన్నారు. అధికారులతో సమీక్షించి.. పాలు, టీ పంపిణీపై కూడా దృష్టిసారిస్తామన్నారు. నడిచి వచ్చే భక్తులకు టోకెన్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు కూడా వచ్చాయని, దీన్ని అధిగమిస్తామని చెప్పారు. ఇక, శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ క్యూలైన్లు భారీగా పెరిగిపోవడంపైనా పరిశీలన చేస్తామని తెలిపారు.

అన్నప్రసాదాల తనిఖీ

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని ఈవో శ్యామలరావు తనిఖీ చేశారు. రాత్రి అన్నప్రసాద భవనానికి చేరుకున్న ఆయన అన్నప్రసాదాలు స్వీకరించారు. తర్వాత వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. అలాగే భక్తుల క్యూలైన్, వారికి అన్నప్రసాదాలు అందే తీరున.. నాణ్యతను గమనించారు.

తొలిరోజే క్యూలైన్ల పరిశీలన

ఈవోగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే తిరుమలలో భక్తుల రద్దీ నెలకొన్న విషయాన్ని శ్యామలరావు తెలుసుకున్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఇతర అధికారులతో కలిసి రింగురోడ్డులో వ్యాపించి ఉన్న క్యూలైన్ వద్దకు వెళ్లారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు అందించే సదుపాయాలను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. ఎక్కడినుంచి వచ్చారు, క్యూలైన్‌లో ఎంత సేపటినుంచి ఉన్నారు.. అన్నప్రసాదాలు, తాగునీరు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. అన్నప్రసాదాలు, తాగునీటి నాణ్యతను గమనించారు. అలాగే నారాయణగిరి షెడ్లను కూడా పరిశీలించి.. సర్వదర్శన భక్తులతో మాట్లాడారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తులు



జస్టిస్ అశోక్‌కినాగి, సుమలత, హరిష్‌కుమార్‌లకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 16: కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. జస్టిస్ హరీష్‌కుమార్, జస్టిస్ అశోక్.ఎస్‌కినాగి, జస్టిస్ సుమలత విడివిడిగా ఆలయానికి చేరుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై టిప్పర్ బోల్తా



గంగాధరనెల్లూరు, జూన్ 16: మండలంలోని మునలయ్యగారిపల్లె వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే బ్రిడ్జిపై నుంచి పాత రోడ్డుపై టిప్పర్ బోల్తాపడింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మునలయ్యగారిపల్లె వద్ద బ్రిడ్జిపైన కంకర రాళ్లు తీసుకెళుతున్న టిప్పర్ అదుపుతప్పి పాత రోడ్డుపై బోల్తాపడింది. ఇంజన్, క్యాబిన్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని గంగాధరనెల్లూరు ఏఎస్ఐ ఆంజినేయులురెడ్డి తెలిపారు.

బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



గుణశేఖర్ మృతదేహం

పెనుమూరు, జూన్ 16: బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సన్యాసిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి స్నేహితులు, పోలీసుల కథనం మేరకు.. సన్యాసిపల్లికి చెందిన గుణశేఖర్(45) చిత్తూరు ఆర్టీసీ డిపో-2లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి తమ వ్యవసాయ బావి వద్ద మద్యం తాగారు. స్నేహితులతో మాట్లాడుతుండగానే బావిలో దూకేశాడు. ఇద్దరు స్నేహితుల్లో ఒకరికి ఈత రాకపోవడం, మరొకరు బావిలో దూకి ఎంత ప్రయత్నించినా గుణశేఖర్ కనిపించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి అతని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కాగా, మృతుడి భార్య 2019లో ఆత్మహత్య చేసుకుంది. పిల్లలు లేరు. బతుకు మీద విరక్తి కలుగుతోందని అప్పుడప్పుడూ గుణశేఖర్ చెబుతుండేవాడని స్నేహితులు పేర్కొన్నారు.

నిందితుడితోపాటు సీఐపైనా
కేసు నమోదుకు కోర్టు ఆదేశం

తిరుపతి(లీగల్), జూన్ 16: గతేడాది సెప్టెంబరులో జరిగిన ఉంగరం చోరీ కేసులో నిందితుడితోపాటు, అప్పటి ఈస్ట్ పోలీసు స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేయాలని రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఫొటోలతో ఉన్న 36గ్రాముల బంగారు ఉంగరాన్ని టీడీపీకి చెందిన స్థానిక టీఎన్‌టీయూసీ నాయకుడు జయరామిరెడ్డి పోగొట్టుకున్నారు. దీనిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పట్టించుకోలేదని, నిందితున్ని పట్టుకుని వదిలేశారని జయరామిరెడ్డి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు సీఐ మహేశ్వర్‌రెడ్డిని ఏ2గా చేర్చి కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితుడి తరపున న్యాయవాదులు వెంకటకుమార్, విద్యానాథ్‌రెడ్డిలు వాదనలను వినిపించారు.

23 ఏళ్ల తర్వాత 'కారుణ్యం'!

పెద్దిరెడ్డి చెప్పారని డీసీసీబీలో నిబంధనల విరుద్ధంగా పోస్టింగ్ ● ఆలస్యంగా వెలుగు చూసిన వ్యవహారం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16: వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలన గాడితప్పింది. పాలకవర్గానికి చేస్తున్న తప్పులు ఎత్తిచూపాల్సిన అధికారులు వారి మెప్పుకోసం వత్తాసు పలికారు. ఆ అంశాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారంటూ 23ఏళ్ల తర్వాత ఓ ఉద్యోగి కుమారుడికి జీవో నెం. 1005 కింద కారుణ్య ఉద్యోగం ఇచ్చినట్లు తెలిసింది. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. డీసీసీబీ పుంగనూరు బ్రాంచ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసిన డి.జయరామ్ 1997 అక్టోబరు 6న మృతిచెందారు. కారుణ్య నియామకాల కింద మృతుడి కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి ఏడాది కాలపరిమితిలో దరఖాస్తుల ఆధారంగా ఉద్యోగం ఇవ్వవచ్చు. ఇది నిబంధన. అప్పట్లో కుటుంబ సభ్యులు చేసుకున్న దరఖాస్తును బ్యాంకు అధికారులు అనర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా మృతుడి కుమారుడు డి.జయప్రకాష్ ఇటీవలి పెద్దిరెడ్డివర్గానికి దగ్గరయ్యాడు. దాంతో మంత్రి పెద్దిరెడ్డి నోటిమాటతో.. నిబంధనలకు విరుద్ధంగా కుప్పం బ్యాంక్ బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా 2020 మే4వ తేది ఉద్యోగం ఇచ్చారు. తొలుత అనర్హుడని పోస్టింగ్ ఇవ్వని అధికారులు, 23 ఏళ తర్వాత ఆ వ్యక్తి అర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఆ మేర బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేసి రహస్యంగా ఆమోదం తెలిపింది. ఈ వ్యవహారంపై కలెక్టర్ షన్మోహన్ విచారణ కమిటీ వేసి నిజాలు నిగ్గుతేల్చాలని టీడీపీకి అనుబంధమైన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్లలో బ్యాంకులో జరిగిన అవకతవకలు, ఇష్టారాజ్యంగా రుణాల వితరణ వంటి అంశాలను బయటకు తీసేపనిలో టీడీపీ నాయకులు నిమగ్నమైనట్లు తెలిసింది.

ఆలయంలోకి దళితుల నిషేధం

- పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు అగ్ర కులస్తుల దాడి
- కుప్పంలో ఉద్రిక్తం

కుప్పం, జూన్ 16: నాగరిక సమాజంలో ఇంకా దళితులపై నిషేధాలు, దాడులు కొనసాగుతున్నాయి. జాతర సందర్భంగా ఆలయంలోకి ప్రవేశించబోయిన దళితులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. కుప్పం పురపాలక సంఘం బండశెట్టిపల్లెలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతను సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బండశెట్టిపల్లెలో ఈ నెల 11వ తేదీన జాతర జరిగింది. అదే గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు పూజ చేసుకోవడానికి ఆలయం వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న అగ్ర కులస్తులు కొందరు వారిని అడ్డుకున్నారు. తమతో సమానంగా దళితులకు ఆలయంలోకి ప్రవేశం లేదని, బయటే పూజలు చేసుకొమ్మని ఆదేశించారు. దీనిపై గ్రామంలో చాలా సార్లు పంచాయితీలు జరిగాయి. గ్రామంలోని ఏ ఆలయానికీ దళితులకు ప్రవేశం లేదంటూ అగ్రకులాలు తీర్మానం చేశారు. దీంతో మొత్తం ఘటనపై దళితులు కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన అగ్ర కులానికి చెందిన మునీంద్ర అనే యువకుడు, ఆదివారం రాజవేలు అనే దళిత యువకుడిపై దాడిచేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అర్బన్ ఎస్ఐ సుబ్బారెడ్డిని వివరణ కోరగా, దళితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సంఘటనపై విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



గాయపడిన రాజవేలు





వి.కోటలో బైక్ రేసింగ్

వి.కోట, జూన్ 16: వి.కోట సమీపంలోని దాసార్లపల్లె వద్ద ఆదివారం బైక్‌రేసింగ్ నిర్వహించారు. దీనికోసం పొలాన్ని సిద్ధం చేశారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, గోవా నుంచి సుమారు 65 మంది జాతీయస్థాయి బైక్ రేసర్లు ఈవెంట్‌లో పాల్గొన్నారు. కిలోమీటరు మేరా ఉన్న విస్తీరణంలో 8 రౌండ్లుగా 10 కేటగిరీల మేరకు రేసర్లు పలు విన్యాసాలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన బెంగళూరుకు చెందిన నేషనల్ రేసర్ సచిన్‌కు ఆల్‌రౌండ్ పర్‌ఫార్మర్ అవార్డు, అరుణ్‌కు ద్వితీయ, కరణ్‌కు తృతీయ బహుమతులను అందజేశారు. మహిళా రేసర్లలో జెస్సీ, మైతూరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. వి.కోటలో అత్యుత్తమ ప్రమాణాలతో బైక్ రేసింగ్ నిర్వహించడం గర్వకారణంగా ఉందని మోటాక్సైట్ నిర్వాహకుడు పృథ్వీబాస్కర్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ సహకారం అందితే ప్రపంచ స్థాయి రేసింగ్ నిర్వహించేందుకు తాము సిద్ధమని నిర్వాహకులు పృథ్వీ, జయదాస్‌మేనన్ తెలిపారు. బైక్ రేసింగ్ ఈవెంట్‌ను ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ ప్రారంభించారు.

పుంగనూరులో టీడీపీ, వైసీపీ నేతలపై కేసులు

పుంగనూరు, జూన్16: పుంగనూరు తెలుగుదేశం, వైసీపీ నాయకులపై మూడు కేసులు పోలీసులు నమోదు చేశారు. శనివారం పుంగనూరులో వైసీపీ నాయకుడు వెంకటరెడ్డియాదవ్ ఇంటిపై దాడి చేశారని చేసిన ఫిర్యాదు మేరకు తెలుగుయువత నాయకుడు నవీన్, ఉమేశ్, ఎల్వీ రమణలపై కేసు నమోదు చేశారు. అలాగే పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద మాజీ ఎంపీపీ నరసింహులుపై పుంగనూరు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, గిరి మరికొందరు దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పుంగనూరు తెలుగు యువత నాయకుడు ఎల్.నవీన్‌పై వైసీపీ నాయకులు ఎన్. వెంకటరెడ్డియాదవ్, వెంకటరమణ, ప్రవీణ్‌చిన్న, బి. వెంకటరెడ్డియాదవ్‌పై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరుత ఘటనపై డీఎఫ్‌వో విచారణ

రామకుప్పం, జూన్ 16: తమిళనాడులో బంధించిన చిరుతను ఆంధ్రా అడవుల్లో వదిలారన్న వందతులపై చిత్తూరు డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి ఆదివారం విచారణ చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరులో కలకలం సృష్టించిన మగ చిరుతను తమిళనాడు అటవీ అధికారులు మత్తుమందు ఇచ్చి బంధించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రామకుప్పం మండలం వీర్నమల అటవీ ప్రాంతంలో వదిలారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో అటవీ సమీప ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో వీర్నమల అడవిలో చిరుతను వదిలారా.. లేరా అన్న కోణంలో డీఎఫ్‌వో విచారణ చేపట్టారు.

అటవీ శాఖలో ఇద్దరికి పదోన్నతులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 16: జిల్లా అటవీ శాఖలోని ఇద్దరు డిప్యూటీ రేంజ్ అధికారులకు ఫారెస్టు రేంజ్ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీరాములుకు పదోన్నతి కల్పిస్తూ పుంగనూరు రేంజ్‌లో ఎఫ్ఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. డి.గురప్పకు ఎఫ్ఆర్వోగా శ్రీసత్యసాయి జిల్లా కదిరి రేంజ్ ఎఫ్ఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు.

నేపాల్‌లో పట్టుబడ్డ 173 టన్నుల ఎర్రచందనం

తిరుపతికి తీసుకొచ్చేందుకు సిద్ధమైన అటవీశాఖ అధికారులు ● ఇతర దేశాల నుంచి ఇలా తీసుకురావడం ఇదే తొలిసారి

మంగళం, జూన్ 16: అత్యంత విలువైన ఎర్రచందనాన్ని వివిధ మార్గాల్లో దేశం సరిహద్దులు దాటిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లు తాజాగా నేపాల్‌లో ఊహించని విధంగా అక్కడి అధికారులకు దుంగలతో పట్టుబడ్డారు. దాదాపు 173 టన్నుల ఎర్రచందనం దుంగలను ఆదేశంలోని అధికారులు పట్టుకున్నారు. అయితే అది ఎర్రచందనం అనేది వారికి తెలియదు. సాధారణంగా కలపను తరలించే సమయంలో అందుకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు లేకుండా తరలిస్తున్న ఈ ఎర్రచందనం దుంగలను సాధారణ కలపగా భావించి వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత విచారణలో ఇది కోట్ల రూపాయల విలువ చేసే ఎర్రచదనం దుంగలుగా గుర్తించారు. మనదేశంతో నేపాల్‌కు ఉన్న సత్సంబంధాల కారణంగా దీనిపై భారత ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించారు. దీనిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎర్రచందనం నిర్ధారణకు నేపాల్ వెళ్లేందుకు ఏపీ ప్రొడక్షన్ పీసీసీఎఫ్ ఖజూరియాకు ఆదేశాలిచ్చారు. నేపాల్‌కు వెళ్లిన ఆయన అక్కడి అధికారులు స్వాధీనం చేసుకుంది ఎర్రచందనం అని నిర్ధారించారు. దీంతో మేనెల నుంచి 90 రోజుల్లో నేపాల్‌లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని భారత్‌కు తీసుకురావడానికి మన ప్రభుత్వం అనుమతులు కూడా ఇచ్చింది.

అధికారులు నేపాల్ వెళ్లడానికి ఏర్పాట్లు పూర్తి

ఈనెల 20వ తేదీన తొమ్మిది మంది ఏపీ అటవీ శాఖ అధికారుల బృందం నేపాల్‌కు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ బృందంలో పీసీసీఎఫ్ ఖజూరియా, విజయనగరం జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, ఎఫ్‌డీవో అప్పిరెడ్డి, తిరుపతికి చెందిన సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో శివకుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో లక్ష్మీపతి, ఎఫ్ఎస్‌వోలు చైతన్య, రమేష్, ఎఫ్‌బీవోలు వేణుగోపాల్, వర్ధన్‌కుమార్‌లున్నారు. ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ఈ బృందం నేపాల్‌లో ఉన్న 173 టన్నుల ఎర్రచందనాన్ని తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తీసుకొచ్చి భద్రపరచనున్నారు. ఇతరదేశాల్లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని మన దేశానికి తరలించడం ఇదే తొలిసారి.

బాబుపై ఆశలతో..మీ-సేవ అడుగులు

● మీ-సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసిన జగన్ ● ఉపాధి కోల్పోయిన వేలాది కుటుంబాలు ● టీడీపీ రాకతో చిగురిస్తున్న ఆశలు


కస్టమర్లు లేక ఖాళీగా వున్న మీ-సేవ కేంద్రం


అమరావతిలో ధర్నా చేస్తున్న మీ-సేవ ఆపరేటర్లు (ఫైల్‌ఫొటో)

బి.కొత్తకోట, జూన్16: గత వైసీపీ పాలనలో సీఎంగా వైఎస్ జగన్ వెలగబెట్టిన రద్దుల పద్దులో మీ-కేంద్రం ఒకటి. పూర్తిగా రద్దు చేయకుండా..అన్నివిధాలుగా కోతకోస్తూ వాటి ప్రాధాన్యతను నిర్వీర్యం చేసి తన అక్కసును తీర్చుకుని వేలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. తమకు అన్యాయం చేయొద్దంటూ నెలరోజుల పాటు అమరావతిలో నిరాహారదీక్షలు చేసినా, కనీసం చర్చలకు కూడా పిలవకుండా మంగళం పాడేందుకే నిర్ణయించడంతో అప్పటిదాకా ప్రజలకు, అధికారులకు వారధిగా సేవలందించిన మీ-సేవ కేంద్రాలు ప్రాధాన్యత కోల్పోయి బోసిపోయాయి. జగన్ మొండివైఖరితో నష్టపోయిన వారిలో ఉద్యోగులు, ఆర్టీసీ, భవననిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల లాంటి బాధితుల జాబితాలోకి మీ-సేవ నిర్వాహకులు, ఆపరేటర్లు చేరారు. ఎపుడెప్పుడు మంచిరోజులు వస్తాయా అంటూ ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

ప్రాభవం కోల్పోయిన కేంద్రాలు

ఈ-సేవగా మొదలై మీ-సేవగా రూపాంతరం చెంది ప్రజాపాలన లో కీలకమైన పాత్ర పోషిస్తూ ఇరవై ఏళ్లకు పైగా సేవలందించిన మీ-సేవ కేంద్రాలు జగన్ రాకతో ప్రాభవం కోల్పోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 9వేలకు పైగా ఉన్న కేంద్రాలలో కొన్ని మూతపడగా, మరికొన్ని నామమాత్రంగా కొనసాగుతున్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీస్, విద్యుత్ తదితర శాఖలకు చెందిన 367 రకాల ప్రభుత్వ సేవలు వీటిద్వారా ప్రజలకు అందేవి. అవసరమైన ధృవపత్రాలతో దరఖాస్తు చేస్తేచాలు సంబంధిత శాఖ అధికారుల వద్దనుంచి సర్టిఫికెట్లు ఇక్కడికే చేరేవి. ఆయా సేవలకు ప్రభుత్వ నిర్ణీత రుసుం మాత్రమే వసూలుచేసేవారు. ప్రజలు చెల్లించిన రుసుములో కొంత ఆపరేటర్లకు కమీషన్‌గా దక్కేది.

సచివాలయాలలో ఉచితం అంటూ మొదలెట్టి..

వైసీపీ రాకతో సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా మీ-సేవలో దొరికే కులం, ఆదాయం, జనన, మరణ ధృవపత్రాలు, 1-బి, అడంగల్, ఈసీ తదితర సేవలన్నీ ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించారు. దీంతో ఆందోళన చెందిన మీ-సేవ నిర్వాహకులు ఇది అన్యాయమని మొరపెట్టుకున్నారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో చేపట్టారు. తమకు న్యాయం జరిగేలా పలురకాల ప్రతిపాదనలు చేశారు. అయినా మనసు కరగని జగన్ వారికి న్యాయం చేయకపోగా ,అప్పటిదాకా లభించిన సివిల్‌సప్లైస్, ఎలక్షన్, రెవెన్యూ లాంటి పలుసర్వీసులను తొలగించారు. పైగా సచివాలయాలలో ఉచితం అంటూ మొదలుపెట్టి కొద్దిరోజుల అనంతరం అదే రుసుం జనం నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

పాదయాత్రలో లోకేశ్ హామీ

యువగళం పాదయాత్రలో తనను కలిసి గోడు చెప్పుకున్న మీ-సేవ నిర్వాహకుల మొరను టీడీపీ యువనేత నారాలోకేశ్ ఆలకించారు. జగన్‌రెడ్డి తన మొండివైఖరితో మీ-సేవలను చంపేశాడని, వేలాది కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయని సానుభూతి వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారం లోకి రాగానే న్యాయం చేస్తామని ప్రకటించారు. ఇపుడు ప్రభుత్వం అధికారం లోకి రావడంతో మీ-సేవలపై ఆశలు చిగురిస్తున్నాయని బాధితులు పేర్కొంటున్నారు. సచివాలయ వ్యవస్థ పై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో, తమకు ఏవిధంగా న్యాయం జరుగుతుందోనని చకోర పక్షులు లాగా ఎదురు చూస్తున్నారు,

మీ-సేవ కేంద్రాలపై ఆరా

తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ-సేవా కేంద్రాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న కేంద్రాల వివరాలు, నిర్వహణ స్థితిగతులపై నివేదిక కోరుతూ సచివాలయ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం పై ఉన్నతాధికారుల పరిశీలన సైతం ఉండబోతున్నట్లు సమాచారం. మీ-సేవల భవితవ్యం రాష్ట్ర ప్రభుత్వ విధానంతో త్వరలో తేలనుంది.

అన్నదమ్ములు ఆస్తిలో వాటా ఇవ్వలేదని దివ్యాంగుడు ఆత్మహత్య..

రామసముద్రం, జూన్ 16: అన్నదమ్ములు ఆస్తిలో వాటాలు ఇవ్వలేదని ఓ దివ్యాంగుడు ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన రామసముద్రం మండలంలో కలకలం రేపింది. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువ నల్లప్పగారిపల్లెకు చెందిన ఆర్.నారాయణస్వామి(56)కు తన అన్నలు రమణప్ప, రాజన్న గత రెండు సంవత్సరాలుగా తన 7 ఎకరాల భూమిలో వాటా పంచలేదు. దీంతో విసిగిపోయిన నారాయణస్వామి, తన భార్య మంజులతో పాటు ఇద్దరి పిల్లలను తీసుకుని బి.కొత్తకోటలోని అలేటివారిపల్లె అత్తగారి ఇంటికి వెళ్లి పోయాడు. రెండేళ్ల తర్వాత తిరిగి రామసముద్రం మండలంలోని దిగువ నల్లప్ప గారిపల్లెకు వచ్చి అన్న రాజన్న, రవణప్పలను ఆదివారం నారాయణస్వామి ఆస్తిలో వాటా ఇవ్వాలని నిలదీశాడు. ఆస్తిలో వాటాలు ఇవ్వడానికి కుదరదని అన్నదమ్ములు తెగేసి చెప్పడంతో తీవ్ర మనస్తాపం చెందిన బాధితుడు, ఇంటి వద్దనే ముందుగా వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతన్ని మదనపల్లెకు తరలించగా డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినప్పటికీ నారాయణస్వామి మృతిచెందాడు అన్నదమ్ముల మోసం కారణంగానే తన భర్త చనిపోయాడని భార్య మంజులమ్మ ఆరోపిస్తూ ఆవే దన వ్యక్తం చేసింది. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి


ధ్వంసమైన తారురోడ్డును పరిశీలిస్తున్న పోలీసులు

కురబలకోట, జూన్ 16: తమ సొంత నిధులతో నిర్మించుకున్న రోడ్డును ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి బాధితుడు రుద్రబాలకృష్ణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని మట్లివారిపల్లె మాజీ సర్పంచ్ రుద్రసరస్వతి, టీడీపీ నేత రుద్రబాలకృష్ణలు గౌడసానివారిపల్లె సమీపంలో భూమిని కొనుగోలు చేసి తమ పొలానికి వెళ్లడానికి ఇటీవల సొంత నిధులతో రోడ్డును వేసుకున్నారు. ఈ రోడ్డును వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారని బాధితులు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ విషయాన్ని టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

చికెన్ కోసం వెళ్లి...ఆస్పత్రి పాలు

మదనపల్లె టౌన్, జూన్ 16: ఆదివారం చికెన్ తిందామని, దుకాణానికి వెళ్లి చికెన్ కొనుగోలు చేసిన వ్యక్తి రోడ్డుప్రమాదంలో బాధితుడై ఆస్పత్రి పాలయ్యాడు. ఆదివారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన రైతు నారాయణరెడ్డి(62) చికెన్ కోసేందుకు మదనపల్లె మండలంలోని మొలకలదిన్నె క్రాస్‌కు వచ్చాడు. చికెన్ తీసుకుని రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి నారాయణరెడ్డిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో త్రీవంగా గాయపడిన నారాయణరెడ్డిని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించి చికిత్స చేయించగా అతని పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు.. ఆందోళనలో రైతన్నలు



నిమ్మనపల్లి, జూన్ 16: మండలంలోని స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వివిధ రకాల విత్తనకాయలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లవలసి వస్తుంది. అయితే కార్యాలయం ఎదురుగా చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతుండంతో ఎరువుల లోడుతో వచ్చిన వాహనాలను బయటనే నిలిపి దింపుకొని కార్యాలయంలో ఉంచుతున్నారు. దీంతో రైతులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సబ్సిడీపై రైతులకు ఇచ్చిన వేరుశనగ కాయలు కొనుగోలు చేసేందుకు కూడా విద్యుత్ తీగలకు భయపడుతూ తెచ్చుకొనే పరిస్థితి నెలకొందని తెలిపారు. వ్యవసాయ కార్యాలయం ఎదుట ఉన్న విద్యుత్ తీగలను మార్చమని ట్రాన్స్‌కో అధికారులకు విన్నపాలు చేసినా పట్టించుకొనే నాధుడులేరని వాపోయారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే విద్యుత్ తీగలను మార్చాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల విధుల ఉద్యోగులకు ప్రశంసాపత్రం


కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీటీ బాబ్జి

మదనపల్లె టౌన్, జూన్ 16: సార్వత్రిక ఎన్నికల విధులు నిబద్ధతతో నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. శనివారం సాయంత్రం జిల్లాలోని పలువురు ఉద్యోగులు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ఎం బాబ్జి కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

మీ-సేవా కేంద్రాలను బతికించండి

పీలేరు, జూన్ 16: గత ప్రభుత్వ నిరాదరణ కారణంగా దాదాపు మూసివేత దశకు చేరుకున్న మీ-సేవా కేంద్రాలను మళ్లీ బతికించేలా చూడాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని పీలేరులోని పలువురు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు మొరపెట్టుకున్నారు. నగరిపల్లెలో ఈ మేరకు ఆయనకు వారు వినతి పత్రం అందజేశారు. 2019కు పూర్వం మీ-సేవా కేంద్రాలలో అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేవని, గత ప్రభుత్వం అధిక శాతం సేవలు తీసివేయడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ చంద్రబాబు మానసపుత్రికలైన మీ-సేవా కేంద్రాలకు జవసత్వాలు లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ పీర్, జ్ఞానంగారి శ్రీధర్, గిరి, ఖాదర్‌వలీ, జవహర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎగువ గిండి గంగమ్మ జాతర


చాందినిబండి

తంబళ్లపల్లె, జూన్ 16: తంబళ్లపల్లె మండలంలోని గోపిదిన్నె బస్టాప్ వద్ద వెలసిన ఎగువ గిండి గంగమ్మ జాతరను ఆది వారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించి పూజారి లక్ష్మన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి దీలూ, బోనాలూ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వివిధ గ్రామాల వారు చాందిని బండ్లను కట్టి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూరా తిప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర


నడివీధి గంగమ్మకు బోనాలు తెస్తున్న మహిళా భక్తులు

కలికిరి, జూన్ 16: మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం గ్రామంలో నడివీధి గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గ్రామస్థులంతా బిందెలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ జాతరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి తనూజా రెడ్డి ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. మాజీ సర్పంచు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కిశోర్‌కుమార్ రెడ్డి దంపతులకు ఘనంగా స్వాగత సత్కారాలు అందజేశారు.

ఆనందంగా పండుగ జరుపుకోవాలి


వాల్మీకిపురంలో నిరుపేదలకు బక్రీద్ తోఫా అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వాల్మీకిపురం, జూన్ 16: ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందంతో బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఆల్ మదద్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షుడు షుూముద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురం నాయక్‌వీధిలోని దర్గా ప్రాంగణంలో 175మంది పేద ముస్లిం వితంతువులకు బక్రీద్ తోఫా ద్వారా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా, బక్రీద్ తోఫా పేదవారికి అందిస్తున్నామని, ట్రస్టు ద్వారా పేదవారి వివాహాలకు నగదు సహాయం, వైద్య ఖర్చులు భవిష్యత్తులో ట్రస్టు ద్వారా మరిన్ని కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నసీ ముల్లాబాషా, సందాని, ఖలందర్, కిజర్, ఇర్ఫాన్, తహీర్ తదితరులు పాల్గొన్నారు.

నగరిపల్లిలో మంత్రి మండిపల్లి


కిశోర్‌కుమార్ రెడిని సన్మానిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కలికిరి, జూన్ 16: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం నగరిపల్లెకు విచ్చేశారు. మండలంలోని రంగనాథపురం గ్రామంలో జరిగిన జాతరకు హాజరయ్యారు. అక్కడి నుంచి మధ్యాహ్నం తిరిగి స్వగ్రామం నగరిపల్లెకు చేరుకుని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం అరగంట సేపు ఇరువురూ ఏకాంతంగా మాట్లాడుకున్నారు. ఇంటి బయట కిశోర్‌కుమార్ రెడ్డి అనుయాయులు మంత్రితో కలిసి ఫొటోలు తీసుకున్నారు..

మంత్రిని కలసిన కొడవలి శివప్రసాద్



మదనపల్లె, జూన్ 16: మున్సి పల్ మాజీ ఛైర్మన్ కొడవలి శివప్రసాద్ రాష్ట్ర మంత్రి మం డిపల్లె రాంప్రాద్ రెడ్డిని కలిసి శుభా కాంక్షలు తెలిపారు. మంత్రిగా మొదటి సారిగా జిల్లా కేంద్రానికి విచ్చేసిన మండిప ల్లెను, కొవడలి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఈ సందర్భంగా మదన పల్లె పర్యటనకు రావాలని కోరినట్లు కొడవలి శివప్రసాద్ పేర్కొన్నారు.

రామసముద్రం మండల అభివృద్ధికి కృషి చేస్తా


కార్యక్రమంలో మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

రామసముద్రం, జూన్ 16: రామసముద్రం మండలంలో విద్య, వైద్య, వ్యవసాయంతో పాటు ప్రజల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఆదివారం మొదటిసారి ఆయన మండలానికి వచ్చారు. మొదట మండల సరిహద్దు కర్ణాటకలోని కురుడుమల గ్రామంలో ఉన్న ప్రముఖ వినాయక దేవాలయానికి వెళ్లిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయనకు పలువురు నాయకులు శాలువలు కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామసముద్రం-మదనపల్లెకు ఉన్న రోడ్డును విస్తరణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో మదనపల్లె టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, కొండూరు నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడు, ప్రశాంత్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, శ్రీనాథ్, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, రామచంద్ర, సయ్యద్‌బాషా, జావీద్, మొహద్, టీడీపీ అశోక్, జనసేన నాయకులు సనాఉల్లా, చంద్ర, సికిందర్, బీజేపీ నేతలు శ్రీనివాస్, వెంకటేష్, పాళ్యం బాలాజి, ప్రజలు పాల్గొన్నారు.

మూగజీవాలకు తీరిన మేత కరువు



కలకడ, జూన్ 16:నైరుతి రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పచ్చదనం పెంపొంది మూగజీవాలకు మేత కరువు తీరింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పొలాల్లో పచ్చిక లేక మూగజీవాలు కడుపు నింపుకోవడం కష్టమైంది. దీంతో పాడి రైతుల వ్యయప్రయాసాలు పడి బయట ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేసి కాస్తో కూస్తో ఆకలి తీరుస్తూ కాలం వెల్లదీస్తూ వచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చదనం బాగా పెంపొందడంతో రైతులకు గడ్డి కొరత తీరింది. కారణంలో పొలాల్లో విచ్చుకున్న పాడి ఆవులు, గొర్రెల మందలు కడుపు నింపుకోవడంతో యజమానులు సంతోషపడుతున్నారు.

మల్లాలమ్మకు మొక్కు చెల్లింపు

ఓబులవారిపల్లె, జూన్ 16 : రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో కాకర్లవారిపల్లె గ్రామ ప్రజలు మల్లాలమ్మకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి టెంకాయ కొట్టి 101 టెంకాయలు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బోటుమీదపల్లె సర్పంచ్ వీరపనేని వెంకటయ్యానాయుడు, మాజీ సర్పంచ్ చుండూరు రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో అన్నదాన ం చేశారు. ఈ సందర్భంగాముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ వీరాభిమానుల పట్టుదల, కృషితో నియోజకవర్గంలో అరవ శ్రీధర్‌ను, రాష్ట్ర ప్రజలు తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, రమణారెడ్డి, గుండయ్యానాయుడు, జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, పగడాల వెంకటేష్, బోటుమీదపల్లె గ్రామ పంచాయతీ ప్రజలు, యువకులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మకు పొంగళ్లు

నందలూరు, జూన్ 16 : మండలంలోని నాగిరెడ్డిపల్లె లో ఆదివారం మారెమ్మకు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అత్యంత సుందరంగా పూలు, నగలతో అలంకరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు యల్లటూరి శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నేత జయచంద్రారెడ్డి


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 16: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబును ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలిశారు. అమరావతిలోని సచివాలయంలో చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అక్కడ చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి అర్హులందరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే టీడీపీ నేత జయచంద్రారెడ్డి మంత్రులు కొల్లు రవీంద్ర, నాదేండ్ల మనోహర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మంత్రి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిశోర్‌కు కొనసాగుతున్న అభినందనల వెల్లువ


కిశోర్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న జాండ్ల టీడీపీ శ్రేణులు

పీలేరు, జూన్ 16: ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. పీలేరు మండల అధికారులు, టీడీపీ శ్రేణులు ఆదివారం ఆయన స్వగ్రామం నగరిపల్లెకు వెళ్లి అభినందనలు తెలిపారు. పీలేరు మండలం జాండ్ల పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు బాబ్జీరెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి తమ అనుచరులు, స్నేహితులతో కలిసి కిశోర్‌ను గజమాలలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా పీటీడీ(ఆర్టీసీ) ఎన్ఎంయూ అసోసియేషన్ నాయకులు డీఎం బండ్ల కుమార్ నేతృత్వంలో కిశోర్ కుమార్ రెడ్డిని సన్మా నించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎన్ఎంయూ నాయకులు పీఎస్ఎం రాజు, సీవీ రమణ, పీఎల్ నాయుడు, రెడ్డప్ప, రఘు, చాన్‌బాషా, పీఆర్ నాయుడు, రమేష్, ఏవీ రమణ, టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మూడే హరి నాయక్, చంద్రా నాయక్, సుధాకర్ నాయుడు, శ్రీనివాసులు, సునీల్ కుమార్ రెడ్డి, స్పోర్ట్స్ రఫీ, మణి నాయక్, కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నల్లారిని సన్మానించిన అధికారులు


నల్లారి కిశోర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో వెంకటరత్నం, ఉపాధ్యాయులు

వాల్మీకిపురం, జూన్ 16: వాల్మీకిపురం మండలానికి చెందిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆదివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసి సన్మానించారు. నగిరిపల్లెలో ఆయన నివాసంలో కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాలమహానాడు నాయ కులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బ్యానర్లను చించివేసిన వైసీపీ నాయకులు


వేంపల్లె కస్పాలో వైసీపీ నాయకులు చింపివేసిన బ్యానర్లు

మదనపల్లె అర్బన్, జూన్ 16: మండలంలోని వేంపల్లె, వేంపల్లె క్రాస్, వేంపల్లె దళితవాడల్లో ఎన్డీఏ కూటమి ప్రమాణస్వీకారోత్సవం, విజయోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లను శనివారం రాత్రి వైసీపీ నాయకులు దౌర్జన్యంగా చించివేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆదివారం ఉదయం వేంపల్లె క్రాస్‌లో టీడీపీ ఏర్పాటు చేసిన బ్యానర్ల వద్ద టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే తాలుకా సీఐ శేఖర్‌కు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి పరిష్కరించి ఆందోళన కారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మదనపల్లె తాలుకా స్టేషన్‌లో సీఐశేఖర్‌కు ఫిర్యాదు చేయగా సీఐ తమ సిబ్బందిని పంపి ఈ విషయంగా విచారణ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు ఎ.వెంకటరమణ, కె.రవి, బి.రాము, ఎ.నల్లప్ప, బి.శివ, జి.వెంకటరమణ, బి.వెంకటరమణ, ఎ.నరేష్, ఎస్.భాను, బి.అర్జున్ పాల్గొన్నారు.

కురబలకోటలో టీడీపీ నేత ఫ్లెక్సీలు చించివేత

కురబలకోట, జూన్ 16: టీడీపీ నేత మలి గి ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేసిన సంఘటన కురబలకోట మండలం లో జరిగింది. తంబళ్లపల్లె మండలానికి చెందిన మలిగి మధుసూధన్‌రెడ్డి 2019, 2024ఎన్నికల్లో టీడీపీ నుంచి టికెట్టును ఆశించిన టికెట్టు దక్కలేదు. కాగా 2024 లో ఆయనకు టిక్కెట్టు ఇవ్వడానికి టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపి ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేయించింది. అయితే ఆయనకు టికెట్టు దక్కలేదు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఈ నెల 12న టీడీపీ అధి నేత చంద్రబాబునాయుడు అమరావతిలో ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో శుభాకాంక్షలు తెలుపుతూ పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లనున్న ట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలం రెక్కలకొండపల్లిలో ఎన్డీఏ కూటమి నేతలు ఏర్పాటు చేసిన బ్యానర్లను వైసీపీ వారు చింపివేశారు కూటమి కార్యకర్తలు పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాద చేశారు. ఏపీ సీఎం గా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు రెక్కలకొండపల్లి బస్టాప్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్, తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలసి ఉన్న ఒక బ్యానర్లు ఏర్పాటు చేయగా వైసీపీ వారు చింపివేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై విచారిస్తానని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసిన బీజేపీ నేతలు


ఎమ్మెల్యే షాజహాన్‌ను కలిసిన బీజేపీ నేతలు

మదనపల్లె అర్బన్, జూన్ 16: స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషాను పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లి మదన పల్లె నియోజకవర్గం పురోభివృద్ధి సాధిస్తారన్నారు. ప్రస్తుత పరి స్థితిలో దేశ ప్రధాని మోదీ సహకారంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకు లు రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డి, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు వసంతకుమార్, బొజ్జప్ప, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన మహాభారతం విరాటపర్వం హరికథ

నిమ్మనపల్లి, జూన్ 16: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లెలో 15వ రోజు ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజ మహాభారతములో విరాటపర్వం హరికథ ప్రేక్షకులను అలరించింది. ఈ సందరర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు 15రోజుల పాటు హరికథతో పాటు నాటకాలు నిర్వహించగా మండలంలోని వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో మహాభారతం చూసేందుకు వస్తున్నారని తెలిపారు. 21రోజుల పాటు మహాభారతాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది


టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జూన్ 16: కష్టాల్లో ఉన్న కార్యకర్తలను టీడీపీ అండగా ఉంటుందని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గ్యాస్ రామకృష్ణ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీరామ్‌చినబాబు వేంపల్లెకు వెళ్లి రామకృష్ణకు ధైర్యం చెప్పారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి, టీడీపీ కార్యకర్తల సంక్షేమనిధి కింద రామకృష్ణకు ఆర్థిక సహా యం చేయిస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, శివకుమార్, రెడ్డికేశవపాల్గొన్నారు.

19న పీలేరు పంచాయతీ వేలం పాటలు

పీలేరు, జూన్ 16: పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు ఆదాయ వనరుల నిర్వహణ కోసం ఈ నెల 19వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్ ఆర్డీ గఫూర్ ఆదివారం తెలిపారు. దినసరి కూరగాయల మార్కెట్టు, ప్రైవేటు బస్టాండు, జంతు వధశాల, షాపింగ్ గదులు, వారపు సంత ప్రాంగణం వద్ద గదుల కోసం వేలం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వేలం పాటల నియమ నిబంధనలను త్వరలోనే వెల్లడిస్తామని ఆయన తెలిపారు.